తేది : 17.10.2020

విజయవాడ.

# ప్రపంచానికి కమ్యూనిజమే ప్రత్యామ్నాయం
# – శతజయంతి ఉద్యమ వార్షికోత్సవంలో నేతలు

ప్రపంచానికి కమ్యూనిజమే ప్రత్యామ్నాయమని, కమ్యూనిస్టు పార్టీ ఆశయాలు సాధించేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సిపిఎం రాష్ట్రకార్యదర్శి పి మధు పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు ఉద్యమ శత వార్షికోత్సవాలు కార్యక్రమం విజయవాడలోని సిపిఎం రాష్ట్రకార్యాలయంలో శనివారం జరిగింది. కార్యక్రమానికి సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. పార్టీ రాష్ట్రకార్యదర్శి పి.మధు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 100 సంవత్సరాల క్రితం భారతదేశంలో మార్క్సిస్టు, లెనిస్టు సిద్ధాంతాలకు అంకితం అయినటువంటి కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భవించిందన్నారు. ఆనాటి నుండి నేటి వరకు రైతాంగం, మహిళలు, గిరిజనులు, దళితుల కోసం కమ్యూనిస్టులు ఎన్నో పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. జాతీయోద్యమంలో గర్వించదగిన పాత్ర నిర్వహించారని వివరించారు. ఎన్నో జమీందారి వ్యతిరేక, రైతాంగం ఉద్యమాలు, కార్మికుల ఉద్యమాలు, జాతీయోద్యమంలోనూ కమ్యూనిస్టులు ఉద్యమించారని, పోరాటాల పర్యవసానంగా రైతులకు, మహిళలకు కొన్ని హక్కులు వచ్చాయని, అవి నేటి బిజెపి పాలనలో ప్రమాదంలో పడ్డాయని అన్నారు. పార్లమెంటులో కార్పొరేట్ వ్యవసాయానికి అనుకూలంగా మూడు చట్టాలను బిజెపి ప్రభుత్వం చేసిందని తెలిపారు. కార్మికుల హక్కులను ప్రమాదంలోకి నెట్టే విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తోందని అన్నారు. బిజెపి పాలనలో మహిళలు, గిరిజనులు, దళితుల హక్కులకు భంగం వాటిల్లుతోందని తెలిపారు. లాక్‌డౌన్ కాలంలో వలస కార్మికులకు, ఇబ్బందుల్లో ఉన్న కార్మిక కుటుంబాలకు కమ్యూనిస్టులు, కార్మిక సంఘాలు ఎనలేని సేవలందించాయని గుర్తుచేశారు. లాక్‌డౌన్ విధించడంతో ప్రమాదంలో పడ్డ ఉపాధి అవకాశాలను, నేటికీ పునరుద్ధరించే చర్యలు చేపట్టలేదని, నూటికి 50శాతం మంది దేశంలో ఉపాధిలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని తెలిపారు. ఉద్యోగాలు చేస్తున్న వారికి సగం జీతాలే లభిస్తున్నాయని అన్నారు. ఇటువంటి ప్రజావ్యతిరేక పాలన కొనసాగిస్తున్న బిజెపికి రాష్ట్రంలోని అధికార పక్షం వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపి వంత పాడుతున్నాయని విమర్శించారు. విభజన హామీలపై వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు నోరుమెదపడంలేదని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమానికి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, కమ్యూనిస్టు ఆశయాలు సాధించేందుకు కమ్యూనిస్టులంతా పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వి ఉమామహేశ్వరరావు కార్యక్రమంలో మాట్లాడారు. పార్టీ కృష్ణాజిల్లా (పశ్చిమ) కార్యదర్శి డివి కృష్ణ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, డి.రమాదేవి, మంతెన సీతారాం, ఎం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.